# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-2, సంచిక-2 16 అక్టోబర్ - 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## గాంధీజీ దృష్టికోణంలో స్వచ్ఛభారత్ - లోకవిద్య దృక్కోణంలో పరిశీలన

ఈ మధ్య దేశ విదేశాల్లో ప్రతిచోట స్వచ్ఛభారత్ నిర్మాణం గూర్చి చర్చ మొదలైంది. గంగానది ప్రక్షాళన, పట్టణ వీధుల ప్రక్షాళన, డ్రైనేజ్ వ్యవస్థ ప్రక్షాళన అంటూ గొప్ప వాళ్ళందరూ చీపుళ్ళు పట్టారు. గాంధీజీ జన్మదినాన అక్టోబరు 2న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ ప్రభుత్వోద్యోగులు కార్యాలయ పరిశుభ్రత మొదలుపెట్టారు. అసలు గాంధీజీ స్వచ్ఛ భారత్ నిర్మాణంకోసం ఏం చెప్పారో దీన్ని ఈ ప్రపంచం అంతా అనుకరించాల్సినసమయం ఆసన్నమైందని లోకవిద్య జనాందోళన భావిస్తోంది.

గాంధీజీ పరిశుభ్రత బాహ్య ప్రపంచానికే కాకుండా మనసుకు కూడా వుండాలని భావించారు. మన సమాజంలో అన్ని వర్గాలవారు తమ జీవన విధానంలో చెత్తా, చెదారం, మలమూత్రాదులు విసర్జించడానికి ప్రకృతి సిద్ధమైన హక్కుందని భావించారు. దాని నిర్మూలనకు, శుభ్రతకు ఇతరులు అంటే కిందివర్గ ప్రజలు పని చెయ్యాలని భావించే వారు. కానీ గాంధీజీ మన దైనందిన జీవితంలో విసర్జించే చెత్తాచెదారం, మలమూత్రాదులను ఇతరులు కాకుండా మనమే శుభ్రం చేసుకోవాలని చెప్పడం కాకుండా చేసి చూపించారు. దానితోనే బాహ్య శుభ్రతతోపాటు మన అంత:శుభ్రత మొదలవుతుందని నమ్మి ఆచరించి చూపించారు.

ఈనాడు వివిధ దేశాల్లో విసర్జన పదార్థాలతో గాలి, నీరు, భూగర్భజలాలు, కూరలు, తిండిపదార్థాలు, పంటలు సర్వం కలుషితమైపోతున్నాయి. ఎవరికి వారు కాలుష్యాన్ని సృష్టించడం తమ హక్కని, దీన్ని నిర్మూలించడం ఇతరుల బాధ్యతని భావిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలను వెదజల్లే పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు శుభ్రత చెయ్యాల్సిన బాధ్యత ప్రపంచ దేశాల అందరిదీ అని చెప్పడం జరుగుతోంది. దీన్నే గాంధీజీ వ్యతిరేకించాడు. అందుకే ఎటువంటి బేధ భావాలు లేని, హెచ్చుతగ్గులు లేని సమాజ నిర్మాణం కోసం లోకవిద్యనే ఆశ్రయించారు గాంధీజీ. ఆయన ఉద్యమాలన్నీ సామాన్యుడు తన జ్ఞానంతో, ప్రకృతితో సంబంధ బాంధవ్యాలు నెరుపుతూ తమ జీవన విధానాన్ని సాగించడానికే గ్రామీణ జీవితాన్నే తన గ్రామ స్వరాజ్‌లో ఆవిష్కరించారు.

సమాజంలో అస్పృశ్యతను నిర్మూలించడానికి ప్రతి పనికీ ప్రతీ వ్యక్తీ తయారు కావాలనీ, ఏ పని ఒక కులానికి కేటాయించటం మానవజాతికే మచ్చని నిరూపించారు గాంధీజీ. గ్రామంలో ఉన్న వివిధ ఉత్పత్తిదారులు ఉత్పత్తులతో స్థానికంగానే తమ అవసరాలు తీర్చుకుంటే గ్రామాభివృద్ధి జరిగి అంతటా స్వాతంత్ర్యం వస్తుందని ఆకాంక్షించారు గాంధీజీ. స్థానిక సంతలో దొరికే వస్తువుల్ని కొనటం, పర్యావరణ నాశనం చేసే పారిశ్రామిక వస్తువుల వాడకాన్ని మానటంలోనే స్వరాజ్యముందన్నారు గాంధీజి.

అసలు స్వచ్ఛభారత్ ఈ రోజే మనముందుకెందుకు వచ్చింది? ఈనాడు ఎన్నడూ లేనంతగా పట్టణ సామాన్య ప్రజలనుంచి పెద్ద పారిశ్రామిక వ్యవస్థలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తతోనూ, ప్లాస్టిక్‌తోనూ, పారిశ్రామిక వ్యర్థాలతోను ప్రమాదకర రసాయనాలనూ నింపుతూ, భూమిని, భూగర్భజలాల్నీ, నదుల్ని, గాలిని, కలుషితం చేస్తూ పర్యావరణాన్ని ప్రజల్ని సమిధల్ని చేనస్తూ, వ్యక్తిగత లాభాల్లో మానవతా విలువల్ని మర్చిపోతున్నారు.

ఒకనాటి అగ్ర వర్ణాలు తన వ్యర్థాల్ని శుభ్రం చేయటానికి నిమ్న వర్గాల్ని ఉపయోగించే సంస్కృతి నిర్మూలన అయిందనుకుంటున్న ఈ తరుణంలో నేటి డబ్బున్న వారంతా బహిరంగ ప్రదేశాన్ని, నదుల్ని, వీధుల్ని, గాలిని అంతా కలుషితం చేస్తున్నారు. ప్రజలంతా దాన్ని భరించమంటున్నారు. అంటే మొత్తం మధ్యతరగతి, పేద ప్రజలు డబ్బున్న వారి వ్యర్థాల్ని శుభ్రం చేయటానికి వినియోగిస్తున్నారు.

అది డబ్బున్నవారు ముందుగా తమ ఫ్యాక్టరీల నుండి, ఉత్పత్తుల నుండి వదిలే కాలుష్యాన్ని ఆపటంతో ప్రారంభం కావాలి. వీరి ఆధిపత్యాన్ని సమాజమంతా తిరస్కరించాలి. అటువంటి ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా మానటమో కనీసం తగ్గించటమో చేయాలి.

అందుకే లోకవిద్య ఆధారిత ఉత్పత్తులైన స్థానిక వస్తువులవాడకం పెరగాలి. ప్లాస్టిక్‌స్థానే, ఈత, తాటి, వెదురు, కొబ్బరిచెట్ల ఉత్పత్తులు, అడ్డాకులు వాడాలి. స్థానిక కంపోస్టు ఎరువుల వాడకం, స్థానిక సేంద్రీయ పురుగు నివారణ మందుల వాడకం, స్థానిక విత్తనాల వాడకం, వాయు మరియు సూర్యరశ్మి ఆధారిత విద్యుత్ వాడకం, గోబర్ గ్యాస్ ప్లాంట్ల నిర్మాణం ద్వారానే స్వచ్ఛ భారతం సాధ్యం.

నదుల్ని, చెరువుల్ని, సరస్సులోనికి వ్యర్థాలను వదిలే పరిశ్రమలన్నీ మూసివేయాలి. నీటిని పొదుపుగా వాడే అంతర పంటల పద్ధతిని, బహుళ పంటల పద్ధతిని, స్వదేశీ స్థానిక విత్తనాలతో వ్యవసాయాన్ని ప్రారంభించాలి.

ఇసుక వాడకాన్ని తగ్గించి, స్థానిక నీటివనరులను రక్షించుకోవాలి. బహిరంగ ప్రదేశంలో చెత్త వేసే సంస్కృతి ఛీత్కరించుకోవాలి. బహిరంగ స్థలాలలో మలమూత్ర విసర్జన మానేవరకూ ప్రతీ ఇంటితో పాటు బహిరంగ స్థలాలలో మలమూత్ర విసర్జన శాలలు నిర్మించాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే మన స్వచ్ఛ భారత్ కోసం స్వచ్ఛంగా జీవించాలి. స్వచ్ఛందంగా పర్యావరణ రక్షణ వినియోగ అలవాట్లు చేసుకోవాలి. అంటే లోకవిద్య జనాందోళన మార్గమే ఆచరించి ప్రతి పౌరుడు బహిరంగ ప్రదేశాల్ని పరిశుభ్రంగా ఉంచాలి.

- నారాయణరావుతో డా॥ కృష్ణరాజులు

## సెప్టెంబర్ 18న వారణాసిలో విజయవంతమైన లోకవిద్యాధరుల ప్రదర్శన

చేనేత వృత్తిదారులు, ఇతరవృత్తిదారులు, లోకవిద్యా సత్సంగ్ జ్ఞానపంచాయితీ సభ్యులు వారణాసిలో 300 మంది ప్రతినిధులతో 2014, 18 సెప్టెంబరులో ఊరేగింపు జరిపారు. సగానికి పైగా మహిళలు ఆంధ్రప్రదేశ్ చేనేత జనసమాఖ్య నుండి పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మాల్వా నీమట్ నుండి సంజీవదాజీ నాయకత్వంలో 40మంది వృత్తిదారులు, ఆదివాసీలు, వారణాసి చేనేత సంక్షేమ సంఘం, చిల్లరదుకాణదారుల సంఘం, భారతీయ కిసాన్ సంఘం, లోకవిద్య సత్సంగ్ గాయకులు పాల్గొన్నారు.

ఈ ఊరేగింపు 2 దశలుగా జరిగింది. ఒకటి వారణాసిలో గంగానది ఒడ్డున బైన్‌సాపూర్‌లో ప్రారంభమై నేతకారులు నివసించే కాలనీల గుండా సాగి పీల్ కోఠీలో నేషనల్ ఇంటర్ కాలేజీ గ్రౌండ్‌కు చేరి సభ జరిగింది. ఈ సభలో మాట్లాడిన చేనేత ప్రతినిధులు రైతులు, చేతివృత్తిదారులు, చిన్నదుకాణాదారులు, ఆదివాసీలు వారి సహజ జ్ఞానం ఆధారంగా చేస్తున్న పనికి విశ్వవిద్యాలయాల జ్ఞానంతో సమానంగా చూడాలని ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సంఘాలిచ్చే కనీస వేతనాన్ని లోకవిద్య సమాజంలోని సభ్యులకు అమలుచేయాలని డిమాండ్ చేసారు. చేనేతరంగ అభివృద్ధి గూర్చి కృషి చేయాలని కోరారు. రెండవ దశలో అనేకమంది నేత వృత్తికారులు, కార్మికులు పీల్‌కోఠి నుండి ఊరేగింపుగా వారణాసి పట్టణ ప్రధాన వీధులగుండా సాగి, టౌన్ హాల్ వద్ద గాంధీ, కస్తూర్బా విగ్రహాలవద్ద నివాళి అర్పించి సభ జరిపారు. లోకవిద్య సత్సంగ్ గాయకులు పాటలు పాడారు.

19వ తేదీ సార్‌నాథ్ విద్యాశ్రమంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా లోకవిద్య సమాజంలోని ప్రతి ఒక్కరికి వేతనాలు సాధించేందుకు పోరాడతామని, ఎవరి దయాధర్మాలపై ఆధారపడిలేమని, తమ జ్ఞానానికి సమానమైన విలువను చెల్లించాలని కోరారు. ఈ సభలో చిత్రా సహస్రబుద్దే, ప్రేమలతా సింగ్, దిలీప్‌కుమార్ ఢిల్లీ, లక్ష్మణ్‌ప్రసాద్, ఇషాన్‌అలీ, మాచర్ల మోహన్‌రావు, వీరనాగేశ్వరరావు, సంజీవ్‌దాజి, సునీల్ సహస్రబుద్దేలు, తదితరులు ప్రసంగించారు.

### గాంధీ కథ

గాంధీతో 20 సం॥రాలు సహవాసి, భూదాన ఉద్యమకారుడు, సంపూర్ణ విప్లవసేనాని జయప్రకాశ్‌నారాయణ్ సమకాలినుడు శ్రీ నారాయణ్‌భాయ్ దేశాయ్ (మహాదేవ్‌దేశాయ్ కుమారుడు) తో "**గాంధీ కథ**" చెప్పబడును.

**సమయం** : 17-1-2015 నుండి 21-01-2015
సా॥ 6 గం॥ల నుండి 9 గం॥ల వరకు

**వేదిక** : లిటిల్‌ఫ్లవర్ స్కూల్, అబిడ్స్,
హైదరాబాద్, తెలంగాణ.

అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

# ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగ దుస్థితి - భవిష్యత్ దర్శనం

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం చేనేత జన సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం 15-10-2014న రాజధాని విజయవాడలో జరుపుకోవడం, ఈ సభకు దేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుండి ప్రతినిధులు తగిన సంఖ్యలో హాజరవుతున్నారు. చేనేత రంగంలో నేతన్నలు కోరుతున్న కోర్కెలకు సమాధానాలు చెప్పే వారు లేకపోవడంతో ఏ దిశగా వీరిమార్గం నిర్దేశించు కోంటారో చూడాలి.

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 700 వరకు చేనేత సహకార సంఘాలు 1 1/2 లక్షల మంది చేనేత కుటుంబాలు అనగా 7 లక్షల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ పథకాల క్రింద ఈ రంగంలో కొన్ని పథకాలు అమలుచేస్తున్నారు. సహకార సంఘాలు నేరుగా తమ ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయిస్తే ఉత్పత్తి అయిన వస్త్రాల ధరలో కేంద్ర ప్రభుత్వం 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం చొప్పున 20 శాతం మార్కెటింగ్ ఇంటెన్సివ్ పేరుతో రిబేట్ ఇవ్వాలి. గత 2 సం॥లుగా 2012-13, 2013-14 లలో ఏడాదికి 14 కోట్ల చొప్పున 2 సం॥లకు 28 కోట్ల రూపాయలు ప్రభుత్వాలు విడుదలచెయ్యకుండా నిలిపి వేసారు. సహకార సంఘాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, పోరాడినా పట్టించుకున్న నాధుడు లేడు.

చేనేతరంగంలో ముఖ్యమైన ముడిసరుకు చిలప నూలు సబ్సిడి కింద వస్తుంది. 2012-13 సం॥లో చిలపలనూలు సబ్సిడి కింద 350 కోట్లు కేటాయిస్తే 2013-14 సం॥లో అది 96.5 కోట్లకు తగ్గిపోయింది. సంక్షేమ పథకాల కింద మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన, హెల్త్ ఇన్సురెన్స్ కింద 2012-13లో 105 కోట్లు కేటాయించి, 2013-14 లో 65 కోట్లకు తగ్గించింది.

ప్రభుత్వ సహకారం, సంక్షేమం తగ్గుముఖం పట్టడంతో సంక్షోభం పెరిగి రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల చేనేత సహకార సంఘాలలో 35 కోట్ల రూ॥ల విలువగల చేనేత వస్త్రాల నిల్వాలు పేరుకుపోయాయి. ఈ పరిణామంతో చేనేత వృత్తిదారులకు పని కల్పించలేకపోవడంతో, ఉపాధి లేక చేనేత వృత్తిదారులు వలసపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పనిలేక అనేక మంది ఇతర ప్రాంతాలకు వలసపోయారు.

అయితే 35 కోట్ల రూ॥ల విలువగల చేనేత వస్త్రాలు నిల్వాలు కొనుగోలు చేస్తే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కార మౌతాయా? ప్రభుత్వం దయతల్చి కొనుగోలు చేస్తే ఆగిపోయిన మగ్గాలు తిరిగి నడుస్తాయి. కార్మికులకు మెరుగైన వేతనాలు మాత్రం రావు. గతంలో కూడా రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న కాలంలో నిల్వాలు పేరుకుపోవడం, ఆప్కో బకాయిలు చెల్లించకపోవడం వంటి సమస్యలు వచ్చాయి. ఈ పరిస్థితి ఎందువల్ల వస్తోంది? సహకార సంఘాలు చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారా? సొసైటీల ద్వారా ఆప్కోకి అమ్మేవి నేతవస్త్రాలేనా? రాష్ట్రంలో ఆప్కో విక్రయ కేంద్రాలలో చేనేత వస్త్రాల పేరుతో జరిగే వ్యాపారంలో చేనేత వస్త్రాల శాతం ఎంత? బోగస్ సొసైటీలు కాగితాలపై లెక్కలలో చూపించే వ్యాపారం వాస్తవంగా చేసే వ్యాపారం ఒకటేనా? మార్కెటింగ్ ఇంటెన్సివ్ పథకం అమలులో జరిగే అవకతవకలు ప్రశ్నించాల్సిన అవసరం లేదా?

చేనేత రంగంలో కేంద్ర ప్రభుత్వం 1985 నూతన జౌళి విధానం నుండే ఆధునిక విధానాలు ప్రారంభమయ్యాయి. మీరాసేఠ్ కమిటీ, సత్యం కమిటీలు ఈ విధానాల కొనసాగింపుగా ఉత్పాదకత ఆధారంగా సిపార్సులు చేసాయి. చేనేత రిజర్వేషన్లు 22 నుండి 11కు తగ్గించడం(చీరలు, లుంగీలు, దుప్పట్లు, మొ॥వి) కనీసం 11 రకాలు కూడా అమలుచేయని స్థితి, ఉల్లంఘించిన మరమగ్గాలు, మిల్లు యజమానులపై కేసులు నమోదు చేయకపోవడం, మరమగ్గాలు, జెట్‌లూంల విస్తరణకు దారితీసి చేనేతరంగంను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేసింది. మరమగ్గాలపై తయారైన వస్త్రాలను చేనేతగా చెలామణీ చేయడం, సహకార సంఘాలు సైతం మరమగ్గాల ఉత్పత్తులను చేనేతగా మార్కెట్ చేయడం, దీనికి జౌళీశాఖ పూర్తిస్థాయి మద్దతునందించడం జరుగుతోంది. మరమగ్గాల విస్తరణ, మరమగ్గాల ఉత్పత్తులను చేనేత వస్త్రాలుగా అమ్మడం తమిళనాడులో ఎక్కువగా వుంది. వారణాసిలో చేనేత మగ్గాలకు మోటార్ బిగించి ఉత్పత్తిని అధికం చేయడం వంటి చర్యలు చాపకింద నీరులా ప్రవేశపెట్టారు.

కేంద్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి క్లస్టర్స్ ఏర్పాటులో ఈ ప్రక్రియను ప్రత్యక్షంగా అమలు చేస్తున్నారు. తమిళనాడులో విరుద్ధనగర్ చేనేత క్లస్టర్‌లో పెడల్‌లూంకు మోటారు బిగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. దేశంలో ఇతర చేనేత ప్రాంతాలలో మాల్, బనారస్, రాయబరేలిలో పాతబడిన మరమగ్గాలపై నేసిన (జుగడ్‌లూం) ఉత్పత్తులను చేనేత వస్త్రాలుగా పరిగణిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2014-15 బడ్జెట్‌లో 500 కోట్లతో మెగా క్లస్టర్లను ప్రారంభిస్తామని వారణాసి, రాయ్‌బరేలి, లక్నో, సూరత్, కచ్, బాగల్పూర్ మరియు మైసూర్‌లలో ఇదే విధానాన్ని అవలంబించబోతోంది. ఇటువంటి చర్యల ద్వారా కార్పోరేట్ల కన్నా ముందే ప్రభుత్వం చేనేత వ్యతిరేక చర్యలకు ప్రధాన బాధ్యురాలుగా ముందుకు వస్తోంది.

కేంద్ర ప్రభుత్వ జౌళీశాఖ, రాష్ట్ర ప్రభుత్వాల జౌళీశాఖలు చేనేత రంగాన్ని దెబ్బతీసే వైపు ప్రణాళికలు తయారు చేసి అమలు చేయడంలో బిజీగా వున్నాయి. చేనేత రంగం పేరుతో కేటాయించే బడ్జెట్లో అధికభాగం మరమగ్గాల రంగానికే తరలించబడ్తోంది. గత 10 సం॥ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లు, జౌళీశాఖల ఆచరణ, బోగస్ సొసైటీల వ్యాపారం దీనినే ఋజువు చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ జౌళీశాఖ కార్యదర్శి చేనేత నిర్వచనం మార్పు చేసేందుకు 'హైబ్రీడ్ లూం' పేరుతో చేనేత వస్త్రాల ఉత్పత్తిలో ఒక ప్రక్రియను చేతితో చేస్తే అది చేనేతగా పరిగణిస్తామని సిగ్గులేకుండా ప్రకటించడంలోనే చేనేతకు మరణ శాసనాన్ని ప్రభుత్వమే రాసేసింది. దీనిపై చేనేత ప్రతినిధులు పెద్ద ఎత్తున వ్యతిరేకించినా లెక్కచెయ్యని స్థితి ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం గత 67 సం॥లుగా చేనేత వస్త్రాల మార్కెటింగ్, ముడిసరుకుల సరఫరా, అభివృద్ధి, సంక్షేమం, రాయితీలపైన ఆధారపడిన చేనేతరంగం నేడు ప్రభుత్వం సంక్షేమం నిలిపివేయడం, ఈ బాధ్యతల నుండి వైదొలగి కార్పొరేట్ రంగానికి అప్పచెప్తోంది. ప్రస్తుత పరిణామాలతో చర్మాన్, రిలయన్స్, అంబానీల పోటీని తట్టుకొని ఎలా నిలబడాలి? ఈ సవాల్‌ను చేనేత జనసమాఖ్య ఏవిధంగా స్పందించబోతోంది. అనేది ఆస్తకరమైన ప్రశ్న.

ఇంతపెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ఎంత వరకు సంసిద్ధులుగా వున్నాం అనేది పరిశీలిస్తే చేనేత వృత్తిదారులు వివిధ పార్టీల కింద చీలిపోయివున్నారు. అధికార, ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోగా నాయమాత్రపు ఆందోళన కార్యక్రమాలు, సాంప్రదాయ పోరాట కార్యక్రమాలు తప్ప ఈ పరిస్థితి ఎదుర్కొనేందుకు తగిన సన్నాహాలు చేయడం లేదు. చేనేత జనసమాఖ్య వీరితో పోల్చుకుంటే భిన్నంగా వున్నా సాంప్రదాయ పద్ధతిలో చేనేత రక్షణకు ప్రజల్ని కదిలించేందుకు సిద్ధపడుతోంది. అయితే పరిస్థితిని మార్చడానికి ఇది సరిపోతుందా? అనేది సమీక్షించుకోవాల్సి వుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుభాగాలుగా విడిపోవడం, నూతన రాష్ట్రాల ఏర్పాటు పరిణామాల నేపథ్యంలో చేనేత రంగంలో ప్రభుత్వం చేనేత వ్యతిరేక విధానాల వలన మార్కెట్ శక్తుల దయాదక్షిణ్యాల పైన ఈ రంగం నిలబడి వుంది. ఇంతవరకు నామమాత్రంగా వున్న చేనేత అనుకూల విధానం చేనేతరంగంను ప్రోత్సహించే విధానాలకు బదులు చేనేత, మరమగ్గాల కలిపివేసి ఉత్పాదకత పేరుతో సంక్షేమ వైఖరి క్రమంగా తగ్గుతూ వస్తోంది. మరమగ్గాల ఉత్పత్తులను చేనేత ఉత్పత్తులుగా చలామణి చేయడం, వస్త్ర ఉత్పత్తిలో కొంతభాగం చేతితో చేస్తే చేనేత అవుతుందని చేనేత నిర్వచనంను మార్పు చేయడం ద్వారా పాలకులు ఈ రంగంలో తమ విధానాన్ని స్పష్టంగా ప్రకటించారు.

ఈ నేపథ్యంలో చేనేతరంగ పరిరక్షణకు మన ముందున్న మార్గం ఏమిటి? సహకార వ్యవస్థను ప్రయోగాత్మకంగానయినా పునరుద్ధరించి నాణ్యమైన చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేయడం, దీనికొరకు కావల్సిన ముడిసరుకు నూలు, రంగులు రాయితీలతో అందించడం, ఉత్పత్తి చేసిన వారే మార్కెటింగ్‌లో స్వయంగా పాల్గొని ప్రజల్లో చేనేత వస్త్రాలకున్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని ఉత్పత్తి, ముడిసరుకుల సేకరణ, మార్కెటింగ్ సహకార సంఘం ఆధ్వర్యంలో వృత్తిదారుల ప్రయోజనాల రీత్యా నిర్వహించాలి.

వివిధ పార్టీల కింద, సహకార సంఘాల కింద వున్న ప్రజల్ని సమీకరించి చేనేత వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జౌళిశాఖ కార్యాలయాలపై, బోగస్ సంస్థలపై మన పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. మార్కెట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బ్యూరాక్రటిక్ అధికారులపై మన పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. బోగస్ కోపరేటివ్‌ల పేరుతో మరమగ్గాల ఉత్పత్తులను మార్కెట్ చేసే ఇంటిదొంగలను పట్టుకొని ప్రజలు బహిరంగంగా శిక్షించాలి. అధికార పార్టీ ప్రతినిధులపై చేనేత అనుకూల విధానాన్ని అనుసరించేటట్లుగా వత్తిడి చేయాలి. అన్ని నగరాలలో చేనేత విక్రయ కేంద్రాలు సహకార సంఘాల ఆధ్వర్యంలో ఉచితంగా నెలకొల్పేటట్లు ప్రభుత్వం ఆఫీసులలో, కార్యాలయాలలో షోరూంలు నెలకొల్పాలి. నాణ్యమైన నూలు వస్త్రాలను ఉత్పత్తిచేసి చేనేత విశిష్టతను గూర్చి, మర మగ్గాల ఉత్పత్తులకు చేనేత ఉత్పత్తులకు ఉండే తేడాని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలి. చేనేత పేరుతో మర మగ్గాల ఉత్పత్తులను మార్కెట్ చేయడాన్ని నేతకారులే ఉద్యమంగా వ్యతిరేకించాలి. నూలు వస్త్రాలు ధరించండి. సింథటిక్ వస్త్రాలను త్యజించండి అని గాంధీ స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి.

చేనేత అనుకూల విధానాన్ని ప్రకటించి, చేనేత రిజర్వేషన్లను పరిరక్షించేందుకు, దీనిని వ్యతిరేకించే బ్యూరాక్రటిక్ అధికారులు, రాజకీయ నాయకులపై మన పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. అమలులో ఉన్న చట్టాలను పరిరక్షించేందుకు చట్ట అనుకూలమైన పోరాటం చెయ్యాలి. చట్టాన్ని అతిక్రమించే వారు ఎవరైనా వారిని చట్ట విద్రోహులుగా ప్రకటించి వారిపై పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ఉత్తరప్రదేశ్‌లో ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలుచేయని బ్యూరాక్రటిక్ అధికారులపై డిఎస్-4 పేరుతో కాన్షీరా మిలిటెంట్ దాడులు నిర్వహించిన చర్యలు మనకు స్ఫూర్తి కావాలి. చేనేతరంగ ప్రజల పోరాటానికి మద్దతుగా ఇతర వర్గాల వారిని సమీకరించి గాంధీ స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి. చేనేతరంగంలో చేనేత వస్త్రాల ఉత్పత్తి, మార్కెటింగ్, సహకార రంగం ద్వారా నిర్వహించడం ద్వారా గుజరాత్‌లోని ఆనంద్ ప్రయోగాన్ని అనుసరించాలి.

అన్ని వర్గాల ప్రజల్ని సమీకరించి విస్తృత ప్రజా ఉద్యమంగా చేనేత వస్త్రాలు ఉత్పత్తిచేస్తే ప్రజల ఉపాధి, మెరుగైన జీవితాన్ని, నిలబెట్టుకోగలుగుతాం.

**- కె.జె. రామారావు**

---

(3వ పేజీ తరువాయి)

పెద్ద కాంట్రాక్టర్లకు 5 లక్షల వరకు పనులు నీటి సంఘాలకు నామినేషన్‌పై ఇచ్చారు. నిర్మాణం పూర్తయిన తర్వాత నీటి సంఘాలకు చెరువును స్వాధీన పరిచి ప్రతి చెరువుపై నీటి పన్ను, మట్టి అమ్మకం, చెట్లు, చేపలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా నీటి సంఘానికి ఆదాయం పెరుగుతుందని ఇక నుండి రైతులే చెరువులను నిర్వహించుకోవాలని లక్ష్యంగా ప్రకటించారు. 7 సం॥ల తర్వాత నేడు చెరువుల్లో నీరులేక, ఆదాయం లేకపోవటం, నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవటం, నిర్వహణా నిధులు లేక మరల శిథిలావస్థకు చేరాయి. నీటి సంఘాల ద్వారా అధ్యక్షులయిన వారు రాజకీయ పార్టీలలోకి చేరి పదవులు సంపాదించేందుకు కొంతవరకు దోహదపడింది. చెరువుల అభివృద్ధి మాత్రం జరగలేదు. 2012లో మరల రంగారెడ్డి జిల్లాలో 33 చెరువుల పై 19 కోట్లు శాశ్వత మరమ్మత్తులకు కేటాయించారు. ఇవి నత్తనడక నడుస్తున్నాయి. ప్రపంచబ్యాంక్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం వీటి కొరకు తదుపరి ఎటువంటి నిర్వహణ పనులు చేపట్టడానికి వీల్లేదు.

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ గ్రామాల్లో తెలంగాణ రాష్ట్రసమితి (టి.ఆర్.ఎస్) బలహీనంగా ఉంది. జిల్లా పరిషత్తు ఎన్నికల నుండి నేటి వరకు అనేకమంది ఇతర పార్టీల వారు టి.ఆర్.ఎస్.లో చేరటం ద్వారా క్రింది స్థాయిలో ఎవరైతే కాంట్రాక్టర్లుగా ఉన్నారో, ఇసుక మాఫియా, సారా మాఫియా వారంతా టి.ఆర్.ఎస్‌లోకి వచ్చారు. ఈనాడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో బహుళ పార్టీ వ్యవస్థకు నూకలు చెల్లి, అధికారంలోకి వచ్చినవారు పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సాహించి ఒకే పార్టీ ఆధిపత్యంలోకి అందరూ చేరిపోతున్నారు. ఇసుక మాఫియా, సారా మాఫియా కాంట్రాక్టర్లు ఒకే పార్టీలో చేరితే తేడా ఏంవుంటుంది? వీరికి భిన్నంగా రైతులు నిలబడి ఇసుక త్రవ్వకాలు ఆపగలరా? లింక్ కాలవలను పునరుద్ధరించి చెరువులకు పునర్ వైభవం సాధించడం సాధ్యమౌతుందా?

ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే తక్షణంగా ప్రభుత్వం ఇసుక త్రవ్వకాలు నిరోధించేందుకు రైతులతో కమిటీలు వేసి ప్రజల సహకారంతో నిలిపివేయాలి. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అది సాధ్యమే. గ్రామం చుట్టూ మర్రి, రావి, వేపచెట్లను పెంచాలి. భూగర్భ జలాలు అధికంగా వాడకుండా 100 అడుగుల లోతునుండి మాత్రమే 1 హెచ్.పి. మోటర్లు వినియోగించి నీరు ఎత్తిపోయాలి. రైతులందరూ తమ పొలాల్లో కురిసిన వర్షాన్ని నిల్వచేసేందుకు ఇంకుడు గుంటలు నిర్మించి నీటిని భూమిలోకి ఇంకించాలి. వర్షాలు కురిసి, చెరువులు నిండేచోట ముందుగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి ప్రతి సంవత్సరం చెరువు నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఆయకట్‌దారుల ఆధ్వర్యంలోనే నిర్వహణా మరమ్మత్తులు చేయించాలి. చెరువుల నిర్మాణంలో పెద్ద కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా పనులు ఇవ్వకుండా, విడతల వారిగా ఆయకట్‌దారులతోనే పనులు చేయించాలి. నీటి సంఘాల నుండి ఇ.ఎం.డి/ఎఫ్.ఎస్.డిలు వసూలు చేయరాదు. పనులు చేసిన వెంటనే చెల్లింపులు చేయాలి. కిందిస్థాయిలో జరుగుతున్న పరిణామాల వలన చెరువులు అభివృద్ధికి అనుకూలంగా లేవు. కావున రైతులు, చెరువుల కింద ఆయకట్‌దారులు పార్టీలతో సంబంధం లేకుండా కృషిచేసిన నాడు చెరువుల పునర్ వైభవం సాధ్యమవుతుంది. ఈ దిశగా ప్రజలను నడిపించాల్సిన బాధ్యత ముందుచూపుగల నాయకులదే.

**- కె.జె. రామారావు**

# తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య - లోకవిద్య దృక్పథం

19వ శతాబ్దంలో భారతదేశం అంతా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహ నూతన పాఠశాల విద్యా విధానాన్ని స్వీకరించినా 300 సం॥లు కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల పరిపాలనలో తెలంగాణా ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా ఉర్దూ, పర్షియా భాషలలో బోధనవల్ల నూతన విద్యా విధానం అందుబాటులోకి రాక ప్రస్తుత సమాజంలో వెనుకబడిన చదువుగా ముద్రపడింది. ప్రస్తుత శాస్త్ర సాంకేతిక యాంత్రిక యుగంలో మంచి ఉద్యోగుల కోసం సరైన ప్రాథమిక విద్య ఒక ముఖ్య ద్వారం వంటింది.

ఈ నూతన విద్యా విధానం పెద్ద ఎత్తున ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు తరలిపోవడానికి పారంపర్య వృత్తుల నుండి నూతన ఉద్యోగాల కోసం సాంప్రదాయ జీవన విధానం నుండి పాశ్చాత్య జీవన విధానం కోసం ఆఖరికి మనకున్న లోకవిద్య జ్ఞానం నుంచి శాస్త్ర, ఆధారిత ఉద్యోగాల వైపు పరుగులు పెట్టిస్తోంది. ఈ నూతన విద్యా విధానం 19వ శతాబ్దపు చివరినుంచి 20వ శతాబ్దపు మొదటి భాగం దాకా నాటి మద్రాస్ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల ఉద్యమానికి దారితీసింది. అందుకే పాఠశాల విద్య జీవన ప్రమాణాలను మారుస్తుందని ఒక అభిప్రాయం కలిగిస్తుంది. లోకవిద్య ఆధారిత వర్గాలకు నూతన విద్యలో ఒక పట్టాన ప్రవేశం దొరకలేదు. అందుకే ఈ రోజున భారత రాజ్యాంగంలో అందరికి చదివే హక్కు చట్టం 2009లో ప్రవేశ పెట్టబడింది.

పాఠశాల విద్యలో మనకు మాతృభాషతో పాటు సామాన్య గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంతో పాటు, ఆటలు, పాటలు, దేహదారుడ్య తరగతులు, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు ఈనాడు పర్యావరణ రక్షణ నేర్పడం జరుగుతోంది. పాఠశాల అంటే భవనాలు, ఆటస్థలాలు, త్రాగేనీరు, వాడేనీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మంచి ఉపాధ్యాయులు మరియు ఇతర ఉద్యోగులు అని విద్యా హక్కు చట్టం నిర్వచించింది. ఈ చట్టం ప్రకారం కుల, మత, ప్రాంత, లింగ భేదాల్లేకుండా అందరికి ఉచిత నిర్బంధ విద్య అందించాలన్నది ప్రధాన అంశం. వీలైనంత వరకు ఏ వాహనం ఉపయోగించకుండా పాఠశాలకు వెళ్ళగలిగే దూరంలోనే వాటిని స్థాపించాలి.

అన్నిటికన్నా ముఖ్యంగా 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఈ పాఠశాలల్లో నియామకాలు, నియమాలు, పర్యవేక్షణ, స్థానిక గ్రామసభకు ఇవ్వాలని ప్రతిపాదించడం జరిగింది. కానీ గత ఆం.ప్ర. ప్రభుత్వంలో ఈ పర్యవేక్షణంతా విద్యాశాఖ గుప్పిట్లోనే వుంచుకుంది. ఈ విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలల నిర్వహణ మీద ప్రధాన హక్కు తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల కమిటీలదే.

10 సం॥ల పాఠశాల విద్యతో ఒక విద్యార్థి తన జీవితంలో ఏ వృత్తిని స్వీకరించి జీవనాన్ని కొనసాగించాలో స్థూలంగా నిర్ణయించుకునేది విద్యే. గత 150 సం॥ల నుంచి వచ్చిన నూతన విద్యా విధానంలో చదువుకున్న వారికి వారి అభిరుచుల మేరకు స్థానికంగా ఉపాధి దొరకక చదువుకున్న నిరుద్యోగులుగా మారారు. అనేక కమిటీలు ఈనాటి విద్యా విధానం మీద జరిపిన పరిశోధనల ద్వారా తేలిందేమంటే ఈనాటి పాఠశాల, కళాశాల విద్యా వ్యవస్థ ఉద్యోగులకోసం విద్యార్థులను తయారుచెయ్యడం లేదనేది. కొన్ని స్కూళ్ళలో చదవడం, రాయడం, సరిగా లెక్కలు చెయ్యడం కూడా రాదు. చాలామంది విద్యార్థులు 10వ తరగతిలోపే చదువు మానేస్తున్నారు. ప్రస్తుత పాఠ్యాంశాలు, ఉపాధ్యాయుల నైపుణ్యం, ఈ లోపానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ రెండు విషయాల గురించి విద్యాచట్టంలో ఎక్కడా లేదు. తల్లిదండ్రుల ఉపాధ్యాయుల కమిటీలకు పాఠ్యాంశాలను నిర్ణయించి పాఠాలను చెప్పే పద్ధతులను నిర్ణయించే అధికారం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ చట్టం యొక్క ముఖ్యోద్దేశాన్ని అమలుపై సామాజిక తనిఖీ ద్వారా ఈ పద్ధతి అవసరమా? దీనిలో మార్పులు అవసరమా? దీనిలో వృదా ఖర్చు ఎంత? దీన్ని ఏ విధంగా అభివృద్ధి చెయ్యాలి అనే అంశాలు లేవు. పారంపర్య వృత్తులలో మరింత నిష్ణాతులవడానికి వెన్వెంటనే ఉపాధి పొందడానికి ఉపయోగపడే లోకవిద్య ఆధారిత నైపుణ్యాలకు ఈ పాఠశాల/కళాశాలల్లో స్థానమే లేకుండా పోయింది. అసలు చెప్పాలంటే ప్రస్తుత విద్యావిధానం తమ పారంపర్య విద్యావిధాన్ని, తమపెద్దల జీవన విధానాన్ని తిరస్కార భావంతో చూడడం తద్వారా పట్టణ ప్రాంతాల్లో చిరుద్యోగులుగా, నిరుద్యోగులుగా మురికి కూపాల్లో నివసించడానికి మానసికంగా తయారు చేస్తోంది.

గ్రామీణ తెలంగాణా ప్రాంతంలో విద్య గురించి 2013 సం॥ నివేదిక ఈ కింది విషయాలు ప్రస్తావించడం జరిగింది.

6-14 సం॥ల వయస్సులో పిల్లలందరూ అంటే 96 శాతం మందిని పాఠశాలకు పంపుతున్నారు. వీరిలో సగంమంది ప్రభుత్వ పాఠశాలలోనూ, 40 శాతం గుర్తింపుపొందిన ప్రైవేట్ పాఠశాలలలోనూ, మిగతా చోట్ల చదువుతున్నారు. అదే విధంగా 3-6 సం॥ మధ్యలో పిల్లలను కూడా 75 నుండి 85 శాతం కిండర్ గార్డెన్ స్కూళ్ళలోనూ, 12శాతం బాల్వాడీలలోనూ చదువుతున్నారు. 60శాతం స్కూళ్ళలో భవనాలు, ఆటస్థలాలు, ప్రహరీగోడ వుండగా, 55 శాతం స్కూళ్ళలో మాత్రమే పరిశుభ్రమైన త్రాగేనీరు, మరుగుదొడ్ల సౌకర్యాలున్నాయని నివేదిక చెప్తోంది. 45 శాతం స్కూళ్ళలో మాత్రమే బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు వున్నాయి. 72 శాతం స్కూళ్ళలో, పిల్లలకు పనికొచ్చే పుస్తకాలున్నాయని నివేదిక చెప్తోంది. ప్రతీ ఉపాధ్యాయుడికి 72 మంది విద్యార్థులతో వ్యక్తిగత శ్రద్ధ చూపడానికి సమయం సరిపోవడం లేదు. 75 శాతం ఉపాధ్యాయులు, 72 శాతం విద్యార్థులు మాత్రం రోజూ స్కూళ్ళకు వెళుతున్నారు.

96శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నా పౌష్ఠిక ఆహారాన్ని సరయిన స్థాయి వరకు ఇవ్వడం లేదు. 30 శాతం విద్యార్థులు చదవడం, రాయడం నేర్చుకోగా, 35 శాతం విద్యార్థులు లెక్కలు నేర్చుకో గలుగుతున్నారు. విద్యాహక్కు చట్టంలోని హక్కులను ఏ పాఠశాలలోనూ అమలుకావడం లేదంటే అతిశయోక్తి కాదు. దీనికి ముఖ్యకారణం 73వ రాజ్యాంగ సవరణ చట్టం సవరణ ప్రకారం పాఠశాలలపై అజమాయిషీ వుండాల్సిన గ్రామ పంచాయితీలకు ఉపాధ్యాయులు నియామకంలో గానీ, వారియొక్క పనిని మదింపు చేసే హక్కుగానీ, పిల్లల చదువులో నైపుణ్యం పెంచడంలోగానీ, మధ్యాహ్న భోజనపథకం అమలులోకాని, భవనాలు మొదలైన మౌలిక సదుపాయాల్లో, పాఠ్యాంశాల్లోనూ గ్రామ పంచాయితీలకు స్థానం లేదు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల కమిటీలు చాలా చోట్ల లేవు. ఉన్నచోట్ల పనిచేయవు. దీనికంతటికి కారణం కేంద్రీకృత విద్యాశాఖ సర్వాధికారాలు తన గుప్పిట్లో పెట్టుకోవడమే. దీని ఫలితం చాలామంది పిల్లలు ఈ నూతన పారిశ్రామిక మరియు సేవారంగాలలో ఎందుకు పనికిరాని వారు గానూ తమ తల్లిదండ్రులనుంచి, సమాజం నుంచి పారంపర్యంగా వచ్చిన లోకవిద్య సమాజాలలో కూడా ఎందుకు పనికిరాని వారుగా తయారవుతున్నారు. మన ముందున్న మార్గం ఏమిటి?

విద్యాలయాలు గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల - ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహింపబడితే, చదవటం వ్రాయటం లెక్కలతోపాటు స్థానిక అవసరాల కోసం, అభిరుచులననుసరించి వివిధ వృత్తులలో నిష్ణాతుల్ని తయారు చెయ్యాలని లోకవిద్య జనాందోళన విశ్వాసం. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు కావల్సిన ఆర్థిక సహాయం బడ్జెట్‌లో కేటాయించాలి.

1. పాఠశాలలకు భవనాలు, ఆటస్థలాలు పరిశోధనాశాలలతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చాలి.
2. ఉపాధ్యాయులు తమ అవసరాల మేరకు గ్రామ పంచాయితీలకే నియమించే అధికారం ఇవ్వాలి. ఉపాధ్యాయులు స్థానికంగానే నివసించాలి.
3. నిర్వహణ, అజమాయిషీల నిమిత్తం ఉద్యోగులను కూడా వారే నియమించే అధికారం, గ్రామంలోనే వారంతా నివాసం ఉండే ఏర్పాటు ఉండాలి.
4. విద్యార్థుల, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పద్ధతిగా జరిపే అవకాశాన్ని అధికారాన్ని స్థానికులచే వండి వడ్డించే అధికారాన్ని గ్రామపంచాయితీకి మాత్రమే ఉండాలి.
5. వడ్రంగిపని, కుట్టుపని, తాపీపని, వంటపని, వ్యవసాయం, చేనేత, పశుపాలన, బట్టలుతకడం, తోలు ఉత్పత్తులు, వెదురుబుట్ట ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ మరియు చిన్న యంత్రాల మరమ్మత్తులు చేయటం, త్రాగునీటి, మురుగునీటి సరఫరా నిర్మాణం మొదలైన పనుల్లో విద్యార్థులకు అభిరుచిననుసరించి ప్రాథమిక అవగాహన కల్గించే పాఠ్యాంశాలు విధిగా చేర్చాలి.
6. గ్రామంలో పనిలో నిష్ణాతులైన రైతును, కమ్మర్ని, కుమ్మర్ని, దర్జీ, మేదర్ని, చెప్పులుకుట్టేవార్ని, వడ్రంగిని, పాల ఉత్పత్తిదారుల్ని, చేనేతలని ప్రతీవారం ఒక గంట పాఠం చెప్పే పద్ధతిని దానికి అతిధి ఆచార్యుని వేతనాన్ని చెల్లించి ప్రతి నిష్ణాతుడి అనుభవాన్ని పిల్లలకి అందించాలి.

**- డా॥ కృష్ణరాజులు**

# చిన్ననీటిపారుదల క్రింద చెరువులకు పునర్ వైభవం లభిస్తుందా?

రాష్ట్ర విభజనానంతరం తెలంగాణాలో చెరువులకు ప్రాధాన్యత నిస్తామనీ, చెరువుల్లో పూడిక తీయించాలనీ, పాటు కాలువలను బాగుచేయిస్తామనీ తద్వారా తెలంగాణా రూపురేఖలు మారుస్తామనీ బంగారు తెలంగాణా సాధిస్తామనీ పాలకులు వాగ్దానాలు చేస్తున్నారు. అయితే కింది స్థాయిలో పరిస్థితి ఎలా ఉంది, సమస్యలు ఏమిటి, ఏంచేస్తే చెరువుల క్రింది భూములకు నీరు లభిస్తుంది అనేది ఈ క్రింది అంశాల ఆధారంగా పరిశీలించాల్సి ఉంది.

రంగారెడ్డిజిల్లా వైశాల్యం 7493 చ.కి.మీ.గా వుంది. ఇందులో 9.75శాతం అటవీ భూమిగా ఉంది. జిల్లా సాధారణ వర్షపాతం 781 మి.మీ. ఇది కూడా ప్రధానంగా జూన్ నుండి సెప్టెంబర్ మధ్యనే (నైరుతి ఋతుపవనాలు) కురుస్తుంది. జిల్లాలో రెండు నదులు మూసీ, కాగ్నాలు ఈ జిల్లా గుండా ప్రవహిస్తాయి. భారీ నీటిపారుదల ప్రాజెక్టులు లేవు. మధ్యతరహా ప్రాజెక్టుగా కోటిపల్లి ప్రాజెక్టు (3723 హె.) లక్నాపూర్ ప్రాజెక్టు (1071హె.) మరియు జుంటుపల్లి ప్రాజెక్టులు (843 హె.) అయితే వర్షపాతం గత 3 దశాబ్దాలుగా గణనీయంగా తగ్గిపోవటంతో వీటి కింద ఆయకట్‌కు పూర్తి స్థాయిలో నీరందడంలేదు. అందువల్ల వీటిని మైనర్ ఇరిగేషన్ కిందనే పరిగణిస్తున్నారు.

వంద ఎకరాల పైన తెలంగాణాలో సాగయ్యే 5063 చెరువుల ద్వారా 5.13 లక్షల ఎకరాలు 100 ఎకరాల కన్నాతక్కువ సాగయ్యే చెరువులు 30,780 ద్వారా 2.60 లక్షల ఎకరాలు మొత్తం 7.73 లక్షల ఎకరాల భూమి చెరువుల కింద సాగవుతున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అయితే 1955లో చెరువుల కింద భూమి 39శాతం సాగులో ఉండగా నేడు 2005లో 14శాతానికి తగ్గింది. దీనికి కారణం ప్రభుత్వాలు అమలుచేసిన అభివృద్ధి నమూనాయే.

ఉదా : 1980 వరకు రంగారెడ్డిజిల్లా చుట్టూ దట్టమైన అడవి వ్యాపించి ఉండేది. అభివృద్ధి నమూనాలో భాగంగా అడవులు నరికివేయడం అనేక ప్రాంతాలు ఆక్రమణకు గురై నిర్మాణాలు రావడంతో క్రమంగా వర్షపాతం తగ్గుతూ వస్తోంది. అనేక చెరువులు ఆక్రమణకు గురవడం, ఎగువ ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించడం, భూగర్భజలాల వినియోగం పెరగడంతో, పాటు కాల్వల వ్యవస్థ ధ్వంసం కావటంతో చెరువుల్లో నీటి లభ్యత తగ్గిపోయింది.

రంగారెడ్డిజిల్లాలో ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణం వల్ల చెరువులకు నీరందించే లింక్ కాల్వలు అదృశ్యమయ్యాయి. కుత్బుల్లాపూర్ (మం), దుండిగల్ (గ్రా)లోని చినదామెర చెరువుకు వచ్చే పాటుకాల్వ ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణం వలన పూడిపోయి చెరువులోకి నీరు రావటం తగ్గిపోయింది. షాబాద్ మండలం చందనవల్లి కత్వ నుండి వచ్చే ఫిరంగి కాల్వ శంషాబాద్, పహడీషరీఫ్, ఆదిబట్ల ద్వారా ఇబ్రహీంపట్నం చెరువుకు నీరు వచ్చేది. ఫిరంగికాల్వను కొన్నిచోట్ల రైతులు ఆక్రమించారు. కొన్నిచోట్ల రోడ్లు వేశారు. 35 కి.మీ. నుండి 53 కి.మీ. వరకు పహడీషరీఫ్, ఎర్రకుంట వరకు 300 పైగా పక్కా ఇళ్ళు కాలవపై నిర్మించారు. 65 కి.మీ. తర్వాత ఆదిబట్ల ప్రాంతంలో టాటా కంపెనీ కాల్వ దిశను మార్పు చేసింది. 85 కి.మీ. పొడవున్నా ఈ పిరంగి కాల్వ 40 చెరువులకు నీరందించి 10వేల ఎకరాలకు పైగా ఆయకట్ సాగయ్యేది. నిజాంకాలంలో నిర్మించిన ఫిరంగి నాలాకు స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస పాలకులు నిర్లక్ష్యం చేయడంతో శిధిలావస్థకు చేరిన పరిణామం ఒక నిదర్శనంగా వుంది. అంతర్జాతీయ విమానాశ్రయం ఔటర్‌రింగ్ రోడ్ నిర్మాణం వల్ల ఫిరంగి కాల్వ ద్వారా మిగిలిన లింక్ కాలువల వ్యవస్థ పూర్తిగా అదృశ్యమైంది.

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు ఇంకొక పాటు కాల్వ ఎలిమినేడు వాగు 50 మీ. వెడల్పున, 60 కి.మీ. పొడవు వుంది. ఈ వాగులో 3 నుండి 4 మీ. లోతుగా ఇసుక త్రవ్వకాలు జరిపి, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. పోచారం కత్వా, ఎలిమినేడు కత్వ, గుమ్మడివల్లి చెరువు బేగంపేట, మైలమ్మ చెరువు, తిమ్మాపూర్ చెరువు, సంధ్యమ్మ, జైత్వారం చెరువులలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వడం వలన భూగర్భ జలాలు ప్రమాదస్థాయిలో పడిపోయాయి.

షామీర్‌పేట చెరువునుండి భువనగిరి వరకు వున్న భువనగిరి వాగులో కూడా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ అభివృద్ధికి భారీ ఆకాశ హర్మ్యాలు కొరకు రంగారెడ్డి జిల్లాలో చెరువుల్లో, వాగుల్లో మట్టి ఇసుకను త్రవ్వటంతో భూగర్భ జలాలు తగ్గిపోవటంతో గ్రామీణ ప్రాంతాలనుండి రైతులు ఉపాధి కొరకు వలసపోవల్సిన స్థితి ఏర్పడింది.

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టుల నిర్మాణంపై చూపించిన శ్రద్ధ చెరువుల పై చూపించలేదు. కాంగ్రెస్ పాలనలో మొక్కుబడిగా కొన్ని చెరువులలో నిర్వహణ పనులు తమ అనుయాయులకు నామినేషన్‌పై కాంట్రాక్ట్ కిచ్చేవారు. 1984 తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ చెరువు నిర్వహణా పనులు వారి పార్టీ వారికి ఇచ్చేవారు. 2007 నుండి చెరువుల్లో శాశ్వత మరమ్మత్తుల పేరుతో అనగా తూము, అలుగు, పంటకాల్వలు, పాటుకాల్వల మరమ్మత్తులు, నిర్మాణం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 3 వేల చెరువులకు ప్రపంచ బ్యాంక్ అప్పుతో శాశ్వత మరమ్మత్తులు మొదటిసారిగా చేపట్టారు. ఉదా॥ రంగారెడ్డిజిల్లాలో 40 చెరువుల క్రింద 13 కోట్లు కేటాయిస్తే, 90శాతం పనులు టెండర్ల ద్వారా

(మిగతాది 2వ పేజీలో)

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.

RNI Regd. No. APBIL/2012/50668 Postal Regn. No. HSE/677/2013-2015



# کیسے ہوگی دیش کی عوام خس حال - ۲

پکّی اور سرکاری نوکر کے برابر کی آمدنی کا دو پیش کریں۔ ایسا کرنے کے لیے دو نکتوں پے مضبوط بھروسہ رکھنا ہوگا اور ایک ساتھ ملکر لنھے سرکار کے سامنے رکھنا ہوگا .

۱ – لوکودیا سماج ملکر لوکودیا کے لیے گیاں کا داوا پیش کریں ، اور

لوکودیا کے لیے سرکاری نوکر کے برابر کا ماں اور کیمت کا داوا پیش کریں .

ایسا ممکن ہو ، اسکے لیے نیچے لکھی گئے نکہتوں پے سوچنا ہوگا .

.. اگر لوکودیا کو کالز کی ودیا کے برابر عزت اور سہولیات مللنے لگے تو کسان کا بیٹا کیوں گاؤں اور کھیت چھوڈ کر جاےگا ؟ کاریگر کا بیٹا کیوں اپنا گھر، سماج اور کام چھوڑکر مزدوری کے لئے گھر گھر اور شہر شہر فیریگا ؟ کیوں گھر کی عورتیں دوسروں کے گھروں میں بے-عزت کام کرنے جاینگی ؟ لوکودیا کے بل پر جینے کا حق تو انسان کو جنموں سے ہے، اس حق کو چھیننا سبسے بڑا پاپ ہے . یہ تو ما کی گودھ سے بچھے کو چھیننے جیسا ہے .

.. لیکن آج یہی ہو رہا ہے . لوکودیا کے بل پر اس دیش کی ۷۵ فیصد آبادی اپنی جیویکا کا بندوبست کرتے ہیں ، لیکن آمدنی یقینی نہ ہونے کارن، گریبی اور گیر برابری کے شکار بنے رہتے ہیں۔ آج وہ لوگ ہی بدحال ہیں جو لوکودیا کے بل پر اپنی زندگی چلاتے ہیں۔ انہیں ہی گھر سے بیغر ہونا پڑتا ہے اور انہی کی پیداوار اور کاریگری کو بازار میں سہی دام نہیں ملتے .

.. عزت سے جینے کے لیے لوکودیا سماج کے لوگوں کو ہر کدم پر مزاحمت کرنی پڑتی ہے۔ بجلی، پانی ، دھنراشی ، اور کچے مال جیسے وسیلہ حاصل کرنے کے لیے بازار ، نظام ، اور سرکاری انتظام انکے سامنے رکاوٹ بنکر کھڈی ہوتی روھتی ہیں۔ یہی نہیں ، انکے ناگرک حقوں کو درکنار کرتے ہوئے انہیں انکے رہنے اور کام کرنے کی جگہوں ، سماجوں ، وسیلہ، سے اچانک کبھی بھی بیدخل کر دیا جاتا ہے .اس ترہ سے انہیں انکے گیاں سے بھی بیدخل ہونا پڑتا ہے۔ وکاس ، شہریکراً اورانکا نظام انہیں لنکے گیاں ادھاریت جیون سے الگ کر نیی ویوسٹھاؤں کے ماتحت کرتی جا رہی ہے . علم ، الاز ،گاؤں بستیوں کی سڈک و سفآیی عادی جیسی عام سودھائیں انکے نصیب میں نہیں ہوتی . ایسے مشکل حلاتوں میں بھی لوکودیا سماج اپنے گیاں کے بھل پر ہی زندہ ہے ، البتہ گیر برابری اور سوتیلے ویوھار کا شکار ہے .

.. لوک ودھیا سماج کے لوگوں کی اس بدحالی کے لیے سرکاروں کے وہ طور تریکے جمیدار ہیں جو انہیں لنکی پیداوار اور بنائی گیی چیزوں کو بزار میں سستا بیچنے اور اپنی ضرورت کا سامان مہنگا خریدنے کے لیے مزبور کرتے ہیں . انمیں کسان ہیں ، آدیواسی ہیں، کپاس ،مٹی، لکڑی، داتو ، کانچ ، پلاسٹک عادی سے ترہ ترہ کا سامان بنانے والے کاریگر ہیں ، ہر ترہ کی سیوا اپلبدھ کرانے والے نائی، دھوبی ، مچوارے، سواستھکرمی جیسے کیی ہنرمند سماج ہیں ،

مشین – موٹر – بجلی – پانی عادی کے مستری ہیں ، کلاکار ہیں ، پٹری - ٹھیلے – گمٹی پر چوٹی پونجی کے پربندھن کی مہارت رکھنے والے دکاندار ہیں ، ترہ ترہ کے کاموں میں لگے مزدور ہیں اور ان سبکے گھروں کی عورتیں ہیں . یہ سب لوگ لوک ویدیا کے گیانی ہیں اور لوکودیا – سماج کے روپ میں پہچانے جاتے ہیں۔ پورا لوک ودیا سماج ( دیش کی آبادی کا ۸۰ فیصد) بازار میں ٹھوکرہے کھاتا رہتا ہے اور ٹھگا جاتا رہتا ہے۔

.. دیش کے نیتا اور پڑے - لکھے سماج کے لوگ یہ کہتے ہیں کہ سبھی لوگ کالز کی ویدیا حاصل کریں اور نوکریاں پایین، کسنے روکا ہے ؟ لیکن آزادی کے ٦٥ سال باد بھی سرکاریں کیول سبکی سیکشا کے سپنے ہی دکھاتی رہی ہے اور سبکی نوکری کا تو سپنا بھی نہیں بنا پایے ہے . آج بہومت جنتا کو پونجی کے پرتیشٹھانوں ، وسو ویدیالیوں اور راجہ کی ویوستھاؤں نے اگیانی گھوشیت کر رکھا ہے . اسکا جواب اسی میں ہے کہ سماج آگے بڈکر یہ داوا پیش کریں کہ لوک ودیا کسی گیاں سے کم نہیں ہے اور اسے وسو ودیالیہ کے گیاں کے برابر کا درجہ ملنا چاہیے .

.. سبسے بڑی بعد کسمتی یہ ہے کہ اس دیش کے نیتا ، پرشاشک، اور پڑے لکھے لوگ لوک ودیا کو گیاں ہی نہیں مانتے . وے کسان ، کاریگر ، یا آدیواسی اور عام عورتوں کے کام کو محض شرم کے کام مانتےہیں اور کہتے ہیں کہ انکے پاس تو صرف ھنر ہے اور کام کرتے رہنے سے ہی یہ کوشل ہو جاتے ہیں . اس بات کو پڑے- لکھے لوگ سرے سے ہی خارج کرتے ہیں کہ ان سبھی کے کاریوں میں سددھانت ، سمج ، اور ترق ہیں ، جنکے چلتے انکے کاریہ گیاں کے کاریہ بنتے ہیں . " گیاں" تو صرف پڑے – لکھوں کا ہی ہوتا ہے ایسا وے مانتے ہیں . ایسے میں لوک ودیا کے لیے " گیاں" کا داوا کرنا ضروری ہے ، اسکے بنا کسان ، کاریگر ، یا آدیواسی خود کے لیے سماج میں برابری کا داوا نہیں رکھ پاینگے .

.. ایسے میں لوک ویدیا سماج کے سامنے کیا راستہ ہے ؟ ہمارے وچار سے لوک ویدیا سماج کو اپنی بدحالی روکنے کے لیے اپنی گیاں کا داوا پیش کرنا چاہیے۔ اسکے لیے پہلی شرط یہ ہے کہ لوک ویدیا کے لوگ خود کو گیانی مانیں اور اپنے گیاں کے لیے سرکاری نوکر کے برابر ماں ، ویتن اور وسیلہ کا داوا پیش کریں . یہ نہ صرف اس سماج کو لسکا آتمبل لوٹاےگا بلکی اس دیش کو ترککی کی راہ پر لا کھڈا کریگا .

ہر طرح کے علم کی دیش اور سماج کو ضرورت ہے اور ہرترہ کے علم کو واجب دام ملنا چاہیے۔ کسان، کاریگر، آدیواسی، عورتیں، مزدور، چھوٹے، چھوٹے دکاندار، اور نوجوانو کو جو کام آتا ہے اسی کی بل پر انھ پکی اور نییمیت آمدنی ملنی چاہیے۔

کوییی آدمی مجدور نہیں ہوتا، بلکہ کسی نہ کسی علم میں ماہر ہوتا ہے۔ اسےکوییی نہ کوییی کام کرنا آتا ہے۔

**మీకు తెలుసా!**

ప్రొ. శ్రీకాంత్‌గుప్తా, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ సర్వే అంచనా ప్రకారం మనదేశంలో సం॥రానికి ప్లాస్టిక్ వాడకం వల్ల 416 వేలకోట్ల రూ॥లు పర్యావరణానికి నష్టం జరుగుతుంది. దీన్ని అరికట్టడానికి ఈత, తాటాకు, అడ్డాకు, కొబ్బరాకు, జనపనార, వెదురు, నూలు సంచులు, బుట్టలు, చాపలు మొ॥నవి వాడితే సుమారు 10 వేలకోట్ల రూ॥లు భారతదేశ ఆదాయంపెరుగుతుందని లక్షలాదిమందికి జీవనోపాధి పెరుగుతుందని తెలుసా!

– తటవర్తి నారాయణరావు

**తక్షణ సహాయం కొరకు ప్రకటన :**

లోకవిద్య ప్రపంచం 2012, జనవరి నుండి క్రమం తప్పకుండా ప్రతినెల ప్రచురిస్తున్నాం. పత్రిక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. కావున చందాదారులు, అభిమానులు పత్రికకు తక్షణం ఆర్థిక సహాయం అందచేసి, సహకరించాలని విజ్ఞప్తి.

A/c No. SBH. 6222207999, గడ్డిఅన్నారం బ్రాంచి, హైదరాబాద్ -ఎడిటర్ లోకవిద్య ప్రపంచం

ఈ పత్రికలోని వ్యాసాలు యథాతథంగా పునఃప్రచురణ హక్కులు అందరివి.

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**BOOK - POST PRINTED MATTER**
**16 OCTOBER - 2014**

**To**

______________________________

______________________________

______________________________

______________________________

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**